

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీల్లో తొలి దశ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. -8లో



అటవీ పరిధిలో స్మగ్లర్ల అరెస్టు

బద్వేల్ అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. కడప డీఎఫ్‌ఓ కార్యాలయంలో డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ వివరాలు వెల్లడించారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.300	రూ.360
రెండోరకం	రూ.200	రూ.290

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 396 మెట్రిక్ టన్నులు



ప్రజలతో మమేకం

అభిమాన నాయకుడితో మాట్లాడాలని కార్యకర్తలు... పంట నష్టాల గురించి చెప్పుకోవాలని రైతులు.. ఓ సారి కలిసి కష్టాలు పంచుకోవాలని ప్రజలు.. రాష్ట్ర నలుమూలల నుంచి వెల్లువలా తరలివచ్చారు. వెరసి పులివెందులలోని భాకరాపేట క్యాంపు కార్యాలయం జనసంద్రమైంది.

ఆయనా అంతే.. ప్రతి ఒక్కర్నీ ప్రేమగా పలకరించారు. ఆత్మీయ కరచాలనం చేశారు.. భుజంపై చేయి వేసి గుండె నిండా ధైర్యమిచ్చారు. కష్టాలు తాత్కాలికమేనని.. మళ్లీ మంచి రోజులొస్తాయని కొండంత భరోసా ఇచ్చారు. తన కోసం శ్రమకోర్చి వచ్చిన ప్రజలతో మాజీ సీఎం వైఎస్ జగన్ మమేకమైన తీరిది.

- నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ పలకరింపు
- కష్టాలు తాత్కాలికమేనంటూ రైతులకు భరోసా
- సమీప బంధువులతో ముచ్చట
- నూతన జంటలకు ఆశీర్వాదం
- పులివెందుల క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్



వైఎస్సార్ సీపీ నాయకుడు విద్యానందరెడ్డి ఇంటికి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయం రోజంతా సందడిగా మారింది. తనను కలవడానికి వచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులతో వైఎస్ జగన్ మమేకమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు మాజీ నేతలతో పలువిషయాలు చర్చించారు. అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రతీ కార్యకర్తకు ఆయా నేతలు అండగా నిలవాలని ఆదేశించారు.

బంధువులతో సమావేశం...

వయోభారంతో ఉన్న పెద్దనాన్న వైఎస్ ప్రకాష్‌రెడ్డి ఇంటికి వెళ్లి మాజీ సీఎం వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగు సూచనలు చేశారు. అక్కడే ఉన్న వైఎస్ మనోహర రెడ్డి, వైఎస్ మధురెడ్డి తదితరులతోపాటు ఇతర బంధువుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మరో సమీప బంధువు శ్రీధర్‌రెడ్డి కుమారుడు యశ్వంత్‌రెడ్డి, శ్రీనిజ జంటను ఆశీర్వదించారు.

అలాగే దొండ్లవాగు వైఎస్సార్‌సీపీ నాయకుడు విద్యానందరెడ్డి సోదరి వివాహం కాగా, ఆయన ఇంటికి వెళ్లి నూతన జంట మాధురీ, నరేంద్రరెడ్డిలను ఆశీర్వదించారు. అక్కడే ఉన్న వారి బంధువర్గాన్ని పేరుపేరునా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

పార్టీ నేతలతో ప్రత్యేక భేటీ: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎస్‌బీ అంజాద్ బాషా, డాక్టర్ సుధీర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సాయినాథ శర్మ తదితరులతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయా నేతలకు తగు సూచనలు చేస్తూ పార్టీ ఉన్నతికి కృషి చేయాలని ఆదేశించారు. కష్టకాలంలో పార్టీకోసం కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని వివరించారు.



కొత్త జంట మాధురీ, నరేంద్రరెడ్డిలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందన



ప్రజల సమస్యలను ఆలకిస్తూ..



వైఎస్ జగన్‌కు శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అభిమానులు



జగనన్నను కలిసిన ఆనందంలో ఓ చెల్లి



ఓ సోదరి సమస్యను వింటున్న జగన్



అభిమాన నాయకుడిని కలవడానికి వచ్చిన ఆనందంలో అభిమానుల కేరింతలు

మంచి రోజులు వస్తాయి...

కూటమి సర్కార్ నిర్లక్ష్యం, అధికారపార్టీ నేతల ఆగడాలపై వివరిస్తూ వచ్చిన కేడర్‌కు మంచి రోజులు వస్తాయి, ఓపిక పట్టాలని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. దౌర్జన్యాలకు జడిసే పరిస్థితి లేదని, వ్యవస్థ తన పని తాను చేసుకెళ్లాలని సూచించారు. ఎప్పుడూ కాలం ఒకేలా ఉండదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారులనుద్దేశించి వ్యాఖ్యానించారు. పక్షం రోజుల క్రితం పెద్దదండ్లూరు గ్రామ వైఎస్సార్ సీపీ నేత హనుమంతరెడ్డిపై దాడి జరిగిందని, మళ్లీ బుధవారం హత్యాయత్నం వెనుక అధికార పార్టీ హస్తం ఉందని పలువురు మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికార పార్టీ ప్రమేయంతో హత్యాయత్నానికి గురైన హనుమంతరెడ్డికి మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు తోడ్పాటునందించాలని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిని ఫోన్‌లో ఆదేశించారు. అలాగే ఆరుగాలం శ్రమించినా పంటలు గిట్టుబాటు కాలేదని పలువురు రైతులు వివరించడంతో మనోస్థైర్యం కోల్పోవద్దు, మంచిరోజులు రానున్నాయని భరోసా కల్పించారు.

న్యూస్‌రీల్

నేడు రూటా ప్రాంతీయ సదస్సు

మదనపల్లె సిటీ: రాష్ట్ర ఉర్దూ టీచర్ల సంఘం (రూటా) ప్రాంతీయ సదస్సును గురువారం స్థానిక ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర నాయకులు ఏ.షాజహాన్, జిల్లా ప్రతినిధులు సిబాతుర్ రహ్మాన్, ఇస్మాయిల్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశ అనంతరం సంఘం ఎన్నికలు జరుగుతాయన్నారు. జిల్లాలోని ఉర్దూ ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు.

నవోదయ ప్రవేశాలకు గడువు పొడిగింపు

రాయచోటి (జగదాంబసెంటర్): నవోదయ ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు మదనపల్లె మండలం వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ టి.వేలాయుధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 9, 11వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న లేటరల్ ఎంట్రీ సెలక్షన్ టెస్ట్ -2025కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి నవంబర్ 9వ తేదీ వరకు గడువు పొడిగించారని తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చదువుతూ 9వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 8వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశం కోరే విద్యార్థులు ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. వివరాలకు 8919956395, 7013201138 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆలయాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి



సిద్ధేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి దేవదాయశాఖ అధికారులు

గుర్రంకొండ: దేవాలయాల వద్ద నిర్వాహకులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథం రాజు అన్నారు. బుధవారం ఆయన గుర్రంకొండలో పర్యటించారు. ఈసందర్భంగా రెండు రోజుల క్రితం చోరీ జరిగిన శ్రీవోని ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరీ, శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయాలను కూడా సందర్శించారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ గుర్రంకొండలో వరుసగా దేవాలయాల్లో చోరీలు జరుగుతుండడం బాధకరమన్నారు. చోరీలు జరిగిన ఆలయాలకు సంబంధించి పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదు చేయించామన్నారు. నిందితులు ఎంతటి వారైనా వదిలిపెట్టేదిలేదన్నారు. ఆయన వెంట ఈఓ బాలకృష్ణ, అర్చకులు కిరణ్‌కుమార్‌శర్మ, మండల బీజేపీ అధ్యక్షుడు రామాంజులు ఉన్నారు.

ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శం

మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



విజేతలకు నగదు, ప్రశంసాపత్రాలను అంజేచేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, సొసైటీ సభ్యులు

రాయచోటి అర్బన్: మహమ్మద్ ప్రవక్త జీవితం మానవాళికి ఆదర్శమని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజనశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక డైట్ సభాభవనంలో ఇటీవల సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీపరీక్షల విజేతలకు బుధవారం ఆయన నగదు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చూపిన సన్మార్గం, ప్రేమ, శాంతి సహనం, సత్యంతో జీవితం గడపాలంటూ ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యాభివృద్ధికి సంబంధించిన పోటీపరీక్షలు నిర్వహించడం వలన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను, నైపుణ్యాన్ని వెలికితీయవచ్చునన్నారు. సహారా వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఆప్తాబ్ మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలోని యువతకు ఉపాధి కోసం ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయించాలని మంత్రిని కోరారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఒక ఆడిటోరియం నిర్మింపచేసి సభలు, సమావేశాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ కన్వీనర్ మహమ్మద్‌అలీ, ఫౌండర్ జిలాన్, ఉపాధ్యక్షుడు మొగల్ ఇలియాస్ బేగ్, సభ్యులు ఆరీఫ్, మౌలానా, సుబాన్, ఫర్హాన్, నిజాంఖాన్,నాసర్, ఇమ్రాన్, రఫాయత్, మహబూబ్‌బాష, ఉపాధ్యా యుడు అస్పాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

మదనపల్లె: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణాలు నాణ్యతతో, వేగవంతంగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మదనపల్లె మండలంలోని వైఎస్సార్ కాలనీ, బాబూకాలనీలోని సీసీ రోడ్డు పనులను కలెక్టర్, ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోడ్డు నిర్మాణం ఎప్పుడు మొదలు పెట్టారు? ఎప్పటిలోగా పూర్తిచేయాలి? నిధుల కేటాయింపు, పనులనాణ్యత తదితర అంశాలపై అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు. అనంతరం మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్‌సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్న ఎమ్మెల్యే వినతిమేరకు పట్టణంలోని నీరుగట్టువారిపల్లె నుంచి సీటీఎం రోడ్డు వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈవీఎం గోడౌన్‌పై నిరంతరం నిఘా ఉండాలి

జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్ వద్ద 24-7 ప్రకారం నిరంతరం నిఘా ఉండాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీలలో భాగంగా రాయచోటి పట్టణం మార్కెట్ యార్డులో ఉన్న ఈవీఎం గోదామును బుధవారం రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పార్టీల సమక్షంలో గోదాము లోపల భద్రపరిచిన ఈవీఎం యంత్రాలు, బీయూలు, సీయూలు, వివిధ ఫ్యాట్‌లను, అక్కడ భద్రతా చర్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం వివిధ అంశాలలో రాజకీయ పార్టీ ప్రతినిధులను అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ కె మధుసూదన్ రావు, ఆర్డీఓ ఏ శ్రీనివాసులు, తహసీల్దార్ పుల్లారెడ్డి, కలెక్టర్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల గోడౌన్‌ను రాజకీయ పార్టీ నాయకులతో కలిసి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

జిల్లాలో 19 కరువు మండలాలు

అన్నమయ్య జిల్లాలో వర్షాభావ పర్థితులను పరిగణలోకి తీసుకొని 19 మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించినట్లు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లి, టి సుండుపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, వీరబల్లి, తంబళ్లపల్లి, గుర్రంకొండ, కలకడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబలకోట, పెద్దతిప్ప సముద్రం, బి కొత్తకోట, మదనపల్లి, నిమ్మనపల్లి మండలాలను కరువు మండలాలుగా ప్రభుత్వం ప్రకటించింది.

దివ్యకాంతుల దీపావళి

- పూజ సామగ్రి, వస్త్ర దుకాణాలు కిటకిట
- పూల ధరలకు రెక్కలు
- జోరుగా బాణసంచా విక్రయాలు



మదనపల్లె సిటీ: జిల్లాలో దీపావళి సందడి నెలకొంది. కొత్త దుస్తులు, టపాకాయలు, లక్ష్మి పూజకు కావాల్సిన సరంజామ కొనుగోలు చేసే పనిలో ప్రజలు నిమగ్నమయ్యారు. ఏటా ఆశ్వయుజమాసం అమావాస్య నాడు దీపావళి పండుగ చేసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ ఏట దీపావళి గురువారం మధ్యాహ్నం 2.47కు ప్రారంభమై శుక్రవారం సాయంత్రం 4.50 వరకు ఉంటుంది. 31వతేదీ సాయంత్రం దీపావళి ధనలక్ష్మి పూజ చేయుటకు శుభప్రదంగా ఉంటుంది.

పూజ, వస్త్ర దుకాణాలు కిటకిట:

జిల్లా వ్యాప్తంగా పండుగ శోభ నిండింది. ఈ నేపథ్యంలో మదనపల్లె, రాయచోటి, రాజంపేట, పీలేరు, వాల్మీకిపురం, రైల్వేకోడూరులతో పాటు పలు మండల కేంద్రాలోల దుకాణాలోల జనం కిటకిటలాడుతున్నాయి. ప్రత్యేకంగా పండుగ కోసం పూజా సామగ్రి కొనుగోలుకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ఇక వస్త్ర దుకాణాలోల సందడి నెలకొంది.

జోరుగా బాణసంచా విక్రయాలు

ఈసారి దీపావళి పండుగ వేళ బాణసంచా దుకాణాల్లో విక్రయాలు జోరందుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రత్యేకంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో జనం టపాసులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

పూల ధరలకు రెక్కలు:

దీపావళి పండుగను పురస్కరించుకుని పూలమార్కెట్లు కిటకిటలాడాయి. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండు, మున్సిపల్ కార్యాలయం, చిత్తూరు బస్టాండు, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో అరటి, మామిడి ఆకుల అమ్మకాలు ఊపందుకున్నారు. పూల మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిటకిటలాడింది. పూలు ధరలకు రెక్కలొచ్చాయి. మల్లెపూలు కిలో రూ.800 పలికాయి. దీంతో పాటు బంతి,చామంతి,రోజా పూలు ధరలు రెట్టింతలయ్యాయి. దుకాణాల్లో పూజల కోసం బూడిదగుమ్మడికాయల అమ్మకాలు ఊపందుకున్నాయి. మట్టి దీపాలు, ప్రమిదలతో పాటు క్యాండిల్స్ దీపాలు అమ్మకాలు జోరుగా సాగాయి.

విజయానికి ప్రతీక

చీకటిని తరిమి వెలుగులు తెచ్చే పండుగ దీపావళి. విజయానికి ప్రతీక. పల్లె నుంచి నగరాల వరకూ ఇంటింటా పిండివంటల ఘుమఘుమలు, నూతనవస్త్రాల రెపరెపలు, చెవులు చిల్లు పడేలా బాణసంచాల ధ్వనులు, ఆ బాలగోపాలం ఆనంద డోలికల్లో తేలియాడే పండుగే ఈ దీపావళి. జిల్లా వ్యాప్తంగా దీపావళి పండుగ శోభ సంతరించుకుంది.

దీపలక్ష్మీ నమోస్తుతే



దీపం జ్యోతి పరబ్రహ్మ. దీపం సర్వతమోవహం .దీపేన సాధ్యతే సర్వమ్ దీపలక్ష్మి నమోస్తుతే. సకల జ్ఞానానికి బ్రహ్మ అధిపతి. దీపం సాక్షాత్తు ఆ పరబ్రహ్మ స్వరూపం.అది సకల తమో గుణాలనూ హరిస్తుంది. ఏ ఇంటిలో దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీ మహాలక్ష్మి ప్రవేశిస్తుందని వేదాలు చెబుతున్నాయి. దీపావళి రోజు సాయంసంధ్యాకాలంలో లక్ష్మి కోట ముందు మొదట దీపాలు వెలిగించి, మహాలక్ష్మిని అష్టోత్తరాలతో పూజించి నివేదిస్తే పుణ్యం లభిస్తుంది.

–శివకుమార్‌శర్మ, వేదపండితులు, మదనపల్లె



దీపాలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కొనుగోలు దారుల రద్దీతో బెంగళూరు బస్టాండు పూలమార్కెట్



కొనుగోలుదారులతో బాణసంచా దుకాణం వద్ద సందడి

శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్: అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు కావల్సిన రూట్లలో, కావల్సిన రోజులు అద్దెకు బస్సులు పంపుతామని చెప్పారు. కర్ణాటక, తమిళనాడు, కేరళలో ఎలాంటి ఆర్టీఓ పన్నులు లేవని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేజీబీవీ ఉద్యోగాల మెరిట్ లిస్ట్ విడుదల

రాయచోటి (జగదాంబసెంటర్): కేజీబీవీ పాఠశాలల్లో టీచింగ్ పోస్టుల భర్తీ కోసం దరఖాస్తు చేసిన అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫై చేసి మెరిట్ లిస్ట్ విడుదల చేసినట్లు సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెరిఫై చేయబడిన సర్టిఫికెట్ల ఆధారంగా అభ్యర్థుల తుది జాబితా 1:3 విధానంలో సిద్ధం చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల జాబితాను వెబ్‌సైట్ https://deoannamayya.blogspot.com/ లో పొందుపరిచామని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే నవంబర్ 1వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సమగ్ర శిక్ష కార్యాలయంలో తెలపాలన్నారు. అనంతరం ఈ లిస్టును ఫైనల్ లిస్టుగా ప్రకటించి అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రి కార్యాలయంలో ప్రజా దర్బార్

రాయచోటి టౌన్: పట్టణంలో మంత్రి మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి తన కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో నెలలుగా పరిష్కారానికి నోచుకొని సమస్యలను వెంటనే పరిష్కారం చేసేందుకు ప్రజాదర్బార్ ఉపయోగపడుతుందని చెప్పారు. తాగునీరు, రోడ్లు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు.

క్లుప్తంగా

ఘనంగా ఉరుసు ఉత్సవం



ఖవ్వాలీ పోటీల్లో గాయని తహసీన్ తాజ్

కలకడ : మండలంలోని కలకడ ఇందిరమ్మ కాలనీలోని మాసుంవలియా షహీద్ స్వాముల దర్గా వద్ద ఉరుసు ఉత్సవం ఘనంగా నిర్వహిం చారు. దర్గా పెద్ద అన్వర్ బాషా ఆధ్వర్యంలో కలిచెర్లకు చెందిన యూసఫ్ హుస్సైనీ, ఉత్తరప్ర దేశ్‌కు చెందిన ఉమర్ దరాజ్, కర్ణాటకు చెందిన తహసీన్ తాజ్ ఖవ్వాలీ పాటలతో అలరిం చారు. వివిధ మండలాల నుంచి ముస్లింలు హాజరై వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహ కులు అన్నదానం చేశారు.

మల్లయ్యకొండకు రూ.5.94 లక్షల ఆదాయం



తంబళ్లపల్లె : మల్లయ్యకొండపై వెలసిన భ్రమ రాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం లో హుండీలను బుధవారం లెక్కించారు. రూ.5,94,257 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓ మునిరాజ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈశ్వరప్ప, మల్లికార్జున, శంకర, కొండకిట్ట పాల్గొన్నారు.

సారా ఊట ధ్వంసం



పీలేరు : వాల్మీకిపురం మండలం ఎగువమేకల వారిపల్లెలో తయారీకి సిద్ధంగా ఉంచిన 2300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. అనంతరం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీ సులు, ఏఆర్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్పల బండి.. ఆగడం లేదండి!

జయంతి రైలుకు రైల్వే శాఖ ఇచ్చిన హాల్టింగ్ అయ్యప్ప భక్తులు ఆశలను నీరుగార్చేలా చేసిందనే విమర్శలు ఎదుర్కొంటోంది. ఉభయ జిల్లాలో ఉంటున్న కేరళ రాష్ట్రానికి చెందినవారు, జిల్లా నుంచి సేలం, కేరళ ప్రాంతాలకు వెళ్లే వ్యాపారులకు ఇదొక్క రైలే దిక్కు. పలు స్టేషన్లలో ఇది ఆగక పోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడే పరిస్థితి. రేణిగుంట, ఇటు కడప, రైల్వే కోడూరు, ఎర్రగుంట్లకు వెళ్లే అయ్యప్ప భక్తులు రైలు ఎక్కాల్సి వస్తోంది.

నవంబరు 2 నుంచి రాజంపేట హాల్టింగ్ ఎత్తివేత



రాజంపేట : ఉభయ వైఎస్సార్ జిల్లాల నుంచి శబరి మలైకు లక్షకు మందికిపైగా అయ్యప్ప స్వామి భక్తులు వెళుతున్నారు. ఎక్కువమంది సామాన్య, మధ్య తరగ తికి చెందిన అయ్యప్ప భక్తులు రైలు ద్వారా శబరిమ లైకు వెళుతుంటారు. అయ్యప్పల రైలు బండిగా జయంతి రైలుకు పేరుంది. కేరళ, తమిళనాడు, కర్ణా టక, తెలంగాణా రాష్ట్రాల నుంచి వెళ్లే అయ్యప్ప భక్తులకు ఈ రైలు ఎంతగానో ఉపయోగపడేంది. అయితే ఇటీవల రైల్వే అధికారులు ఉభయ జిల్లాల పరిధిలోని ఎర్రగుంట్ల, కడప, కోడూరులోనూ హాల్టిం గ్ ఇచ్చారు. నవంబరు 2వ తేదీ నుంచి పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రం రాజంపేటలో జయంతి ఎక్స్ ప్రెస్ రైలు ఆగడం లేదని బుధవారం దక్షిణ మధ్య రైల్వే నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. ముద్దనూరు, కొండాపురం, నందలూరు, రాజంపేట, కమలాపురం స్టేషన్లలోనూ ఆగని పరిస్థితి. దీంతో ఇతర ప్రాంతాల స్టేషన్లకు వెళ్లి ప్రయాణికులు రైలు ఎక్కాల్సి వస్తోంది. అయ్యప్పల సీజన్‌లోనే హాల్టింగ్ ఎత్తివేయడంతో అయ్యప్పస్వాములు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము రైల్వేకోడూరు, రేణిగుంట, కడపకు వెళ్లి ఎక్కా లంటే ఇబ్బందిపడాల్సి వస్తుందంటున్నారు.

హాల్టింగ్ ఎత్తివేయడం సరి కాదు



జయంతి రైలుకు రాజంపేటలో హాల్టింగ్ ఎత్తివేయడం అన్యాయం. అయ్యప్పస్వాములు ఈ రైలు ద్వారా శబరిమలైకు వెళ్తారు. అటు కడప, రైల్వేకోడూరు, రేణి గుంట నుంచి వెళ్లాలంటే కష్టమే. ఎంపీలు మేడా రఘునాథరెడ్డి, మిథు న్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకెళ్తాం.

– పీసీ.యోగీశ్వరరెడ్డి, మాజీ చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ

రాజంపేటలో రైలు నిలపాలి



అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం రాజంపేటలో జయంతి ఎక్స్‌ప్రెస్ రైలు నిలపాలి. అయ్యప్పల బండిగా జయంతికి పేరుంది. కొన్ని దశాబ్దాలుగా ఈ రైలు ద్వారా అయ్యప్పకొండకు చేరుకుంటున్నారు. పార్లమెంట్‌లో జయంతి హాల్టింగ్‌ను కొనసాగేలా చర్చించాలి.

– పాలెం సాంబశివయ్యగౌడ్, అయ్యప్ప భక్తుడు, నందలూరు

వ్యక్తిపై పురపాలక సిబ్బంది దాడి

విలువైన వస్తువులు ధ్వంసం

మదనపల్లె : పట్టణంలోని ఓ వ్యక్తి ఇంటిపై పురపాలక సిబ్బంది దాడికి పాల్పడ్డారు. ఇంట్లో విలువైన వస్తువు లను ధ్వంసం చేశారు. బాధితుడి వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన ముబారక్ మున్సిపల్ వర్కర్ యూనియన్ కార్యదర్శిగా పనిచేస్తు న్నారు. అదే పట్టణానికి చెరందిన పాల్ బాలాజీతో ముబారక్‌కు ఆర్థిక లావాదేవీలున్నాయి. ఇటీవల పాల్ బాలాజీ తన ఇంటిని నెహ్రూ బజార్‌లోని అలంకార్ వస్త్ర దుకాణం యజమాని శ్రీనివాస్‌కు విక్రయిం చాడు. మంగళవారం అకస్మాత్తుగా ముబారక్ అక్కడికి వచ్చి ఇంటిని ధ్వంసం చేయడం ప్రారంభించాడు. స్థానికులు యజమాని శ్రీనివాస్‌కు తెలుపగా.. ఎం దుకు ఇంటిని ధ్వంసం చేస్తున్నావని ప్రశ్నించాడు. పాల్ బాలాజీ తనకు డబ్బులివ్వాల్సి ఉందని, ఈ ఇల్లు అతడిదే కాబట్టి ధ్వంసం చేస్తున్నానని ముబారక్ చెప్పారు. ఆ ఇల్లు తనదంటూ శ్రీనివాస్ చెప్పినా విన కుండా ఇంట్లో గ్రానైట్, ఇంటి ఎదుట అమర్చిన అద్దాలు, నీటి పైపులు ధ్వంసం చేశాడు. ఈ దౌర్జన్యాన్ని శ్రీనివాస్ వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తే.. నన్ను ఎవరూ ఏమీ చేసుకోలేరంటూ దౌర్జన్యం చేశాడు. దీంతో శ్రీనివాస్ వన్‌టౌన్ పోలీసు లకు ఫిర్యాదు చేయగా, వారు ముబారక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో తనకు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొ న్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జోక్యం చేసుకుని, పోలీసులతో మాట్లాడి రాజీప్రయత్నాలు చేసుకోవాల్సిందిగా సూచించినట్లు తెలిసింది.



మున్సిపల్ వర్కర్ దాడిలో ధ్వంసమైన శ్రీనివాస్ ఇల్లు

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబం



గాండ్లపెంట రెడ్డెప్పరెడ్డి (ఫైల్)

కురబలకోట : విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన విచారకర సంఘటన బుధ వారం కురబలకోట మండలంలో చోటుచే సుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కనసానివారిప ల్లెకు చెందిన రైతు గాండ్లపెంట రెడ్డెప్పరెడ్డి (45) బుధవారం కమతంపల్లెకు చెందిన ఓ రైతు పొలం దున్నడానికి మల్లేలగడ్డ వద్దకు ట్రాక్టర్ తీసుకెళ్లాడు. అక్కడ పొలం దున్నుతుండగా ట్రాక్టర్ మడక తగిలిచిన్నపాటి విద్యుత్తు స్తంభం పడిపోయిం ది. విద్యుత్తు ఉందని గమనించకుండా కిం ద పడిన తీగ పైకి లాగి కట్టాలని చెట్టెక్కాడు. లాగే క్రమంలో పైన విద్యుత్ లైన్‌కు తీగ తగిలి షాక్‌కు గురై అక్కడిక క్కడే మృతిచెందాడు. ఇతడికి భార్య శకుం తల, కమారులు హితేష్‌రెడ్డి, రుత్విక్ రెడ్డి ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడం తో ఆ కుటుంబం రోధించిన తీరు అం దరినీ కలచివేసింది. ఎస్‌ఐ దిలీప్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈ గంగాధర్, ఏడి సురేంద్ర నాయక్, ఏఈ శంకర్‌రెడ్డి సంఘటనా స్థలం పరిశీ లించారు. జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

గ్యాస్ లీకేజీతో అగ్నిప్రమాదం

మదనపల్లె : పట్టణంలోని మోతీ నగర్‌లో బుధవారం సాయంత్రం గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం సంభ వించింది. ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లింది. స్థానికుల వివరాల మేరకు.. మోతీన గర్‌లో నివాసమున్న సురేష్ ఇంటిలో గ్యాస్ లీకేజీ కావడంతో అగ్నిప్రమాదం జరిగింది. మంటలతో పాటు ఇళ్లంతా పొగలు నిండిపోవడంతో యజమాని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజే శారు. ఫైర్ ఆఫీసర్ శివప్ప చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఇంటిలో పొగను పీల్చి తీవ్ర అస్వస్థతకు గురైన క్రిష్ణమ్మ(55)ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ప్రమాదంలో రూ.5లక్షల నష్టం వాటిల్లగా, మరో రూ.8 లక్షల ఆస్తిని అగ్నిమా పక అధికారులు కాపాడినట్లు యజమాని సురేష్ తెలి పారు. అనంతరం స్థానికులకు గ్యాస్ వల్ల జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ అధికారులు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె : మదనపల్లి టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపల్లి సచివాలయం రోడ్డు పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తి అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతుడు ముదురు నీలపుచుక్కల చొక్కా ధరిం చారు. ఆయన వయస్సు సుమారు 40–45 మధ్య ఉంది. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా



మాట్లాడుతున్న పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ ఓబులేసు

మదనపల్లె సిటీ : స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో బుధవారం స్కిల్ డెవలప్‌మెంట్, సిడాప్, జిల్లా ఉపాధి కల్పనాశాఖ సంయుక్తంగా జాబ్ మేళా నిర్వ హించాయి. నాలుగు కంపెనీ ప్రతినిధులు హాజరై 11 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్లేస్‌మెం ట్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

ఓబులవారిపల్లె : మంగంపేట జాతీయ రహదారిపై ఇనుప వస్తువులను చోరీ చేసిన గొల్ల జగదీష్ బుధ వారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.మహేష్ తెలి పారు. మంగంపేట జాతీయ రహదారిపై చెన్నకేశ వస్వామి ఆలయం సమీపంలో పల్వ రైజింగ్ మిల్లులో ఉపయోగించే రోలర్ బుష్ రాడ్లను సం చిలో తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు వారు తెలి పారు. వాటి విలువ రూ.44వేలు ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు.



సారా ఊటను పరిశీలిస్తున్న పోలీసులు

సారా ఊట ధ్వంసం

మదనపల్లె : మండలంలోని నారమాకుల తండా గ్రామంలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తయారీకి సిద్ధంగా ఉంచిన వేయి లీటర్ల సారా ఊట ధ్వంసం చేశారు. అనంతరం ఎస్‌ఐ చం ద్రమోహన్, గ్రామస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. సారా తయారీ, విక్ర యించడం, రవాణా చేయడం చేస్తే కఠి నచర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ఈ కార్యక్రమంలో 50 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిగుంట్లపల్లెలో ఘర్షణ



గాయపడిన ఈశ్వరమ్మ

వీరబల్లి : చెత్త దిబ్బ విషయంలో ఇరు వర్గాల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. మండలంలోని తాడిగుంటపల్లి పంచాయతీ పిచ్చిగుంటపల్లిలో తాటిగుంటపల్లి మాజీ సర్పంచి రామచంద్రారెడ్డి వెళ్తుండగా అదేగ్రామానికి చెందిన ముద్రగడ ఈశ్వ రమ్మ, పార్వతి చెత్త దిబ్బ విషయమై తమ గోడు విన్నవించారు. దీంతో అదే గ్రామానికి చెందిన రామ చంద్ర కుమారులు సంజీవ, నాగేంద్ర, రెడ్డమ్మ, బయ్యమ్మ అనే నలుగురు రాళ్లతో దాడికి దిగారు. ఈ దాడిలో ఈశ్వరమ్మ, పార్వతిలకు గాయా లయ్యాయి. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం – ఒకరి అరెస్టు

ఓబులవారిపల్లె : గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ వేంకటేశ్వర్లు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. పక్కా సమాచారంతో మండలంలోని ఎల్లాయపల్లె ఎంపీడీఓ మల్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఎస్‌ఐ మహేష్ ఎల్లాయ పల్లె క్రాస్ రోడ్డు వద్ద బుధవారం తనిఖీలు నిర్వహిం చారు. ఎల్లాయపల్లె దళితవాడ సమీపంలోని మిర పతోటలో నరసయ్య గంజాయి పెంచి సంచిలో దాచి ఉంచారు. అతడిని అరెస్టు చేసి రూ.15 వేల విలువ గల 750 గ్రాములు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాలలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే తమకు సమా చారం ఇవ్వాలని సీఐ ప్రజలను కోరారు. ఈ కార్య క్రమంలో ఎస్‌ఐ మహేష్, ఉపేంద్ర, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



గంజాయి విక్రయిస్తున్న నరసయ్య అరెస్టు చూపుతున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ మహేష్

అధికారుల నిర్లక్ష్యంతోనే ఇసుక గొడవ

ప్రొద్దుటూరు : అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రొద్దు టూరు మండలం రామాపురం గ్రామం వద్ద టీడీపీ కార్యకర్తల మధ్య పరస్పర దాడులకు దారి తీసిం దని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గురివిరెడ్డి ఇసుక దందాకు అడ్డే లేకుండా పోయింది. పెన్నా నది ఒడ్డునే గ్రామం ఉండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఈయన అక్రమ రవాణా దందా కొనసాగిస్తు న్నారు. ప్రొద్దుటూరుకు ఇసుకను తరలించి అమ్మడం రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలిసినా గ్రామానికి అలా వెళ్లి ఇలా మొక్కుబడిగా తిరిగి రావడం పరిపాటిగా మారింది. ఇది ఆసరాగా చేసుకుని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వర్గీ యుడు గురివిరెడ్డి పెన్నానదిలో చెక్ పోస్టు తరహాలో గేట్ ఏర్పాటు చేశాడు. బండికి, ట్రాక్టర్‌కు ఇసుక తీసుకెళ్లాలంటే ధర నిర్ణయించి.. ఆ మొత్తం చెల్లిస్తేనే బండి లేదా ట్రాక్టర్‌ను పెన్నానదిలోకి అను మతిస్తానని ఖరాఖండిగా చెబుతున్నారు. బుధ వారం గ్రామంలోని టీడీపీ వర్గీయులే పరస్పర వాగ్వాదానికి దిగడంతో విషయం మళ్లీ వెలుగులోకి వచ్చింది. గతంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న తహసీల్దారు గంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి జీపును అడ్డుకుని 'నా జోలికి వస్తే నీ జీపు కాలుస్తా' అని గురివిరెడ్డి హెచ్చరించిన సంఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. పోలీసులు, అధికారుల్లోనూ.. ఆయన ఆగడాలను అడ్డుకునే వారే లేకుండాపోయారు.



సంఘటనా స్థలంలో దాడి చేస్తున్న గురివిరెడ్డి

అటవీ పరిధిలో స్మగ్లర్ల అరెస్టు



నిందితుల వివరాలను తెలియజేస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్

కడప అర్బన్ : బద్వేల్ అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. కడప డీఎఫ్ఓ కార్యాలయంలో విలేకరులకు డీఎఫ్ఓ వినీత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బద్వేల్ అటవీ రేంజ్‌లోని బ్రాహ్మణపల్లి సెక్షన్, బోయినపల్లి బీట్ పరిధిలో వన్యప్రాణి పెంగోలిన్(అలుగు)ను తరలిస్తున్న సమాచారం అందిందని తెలిపారు. దాడులు చేసి గోపవరం మండలానికి చెందిన రామిరెడ్డి, పాలెంకు చెందిన రాగి శ్రీను, బద్వేల్ మండలం లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన పాలగిరి పెంచలయ్య, నెల్లూరు జిల్లా వింజ మూరు గ్రామానికి చెందిన లెక్కల శివారెడ్డి, మర్రి పాడుకు చెందిన వెంకటాద్రి, వింజమూరుకు చెం దిన ఓంకారం బాబులను అరెస్టు చేసినట్లు తెలి పారు. వారి నుంచి అలుగు, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు పట్టివేత

బ్రాహ్మణపల్లి బీట్ పరిధిలో ఎర్రచందనం రవా ణా చేస్తున్న కాశినాయన మండలం నారాయణ పల్లె గ్రామానికి చెందిన రాంబాబు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామానికి చెందిన తురక సుబ్బరాయుడులను అరెస్టు చేసి వారి నుంచి 109 కిలోల ఎర్రచందనం దుంగ లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి అరెస్ట్ చేయడంలో కృషిచేసిన అధికారులు బి.స్వామి వివేకానంద, కె.వెంకటశేషయ్య, ఎస్ఎస్.ఖాజావ లి, ఎం.పుష్పరాజ్, సి.విజయలక్ష్మి, ఎం.సువర్ణకు మార్, పి.రాజేష్‌రెడ్డి, ఎల్.లక్ష్మీనరసమ్మ, ఎస్‌డీ. మునాఫ్, ఎస్.అక్బర్‌షరీఫ్, సిబ్బందిని డీఎఫ్ఓ వినీత్‌కుమార్ అభినందించారు. స్వాధీనం చేసుకున్న పెంగోలిన్(అలుగు)కు వెటర్నరీ డాక్టర్ చే పరీక్షలు చేయించి, అటవీ ప్రదేశంలోనే సురక్షి తంగా వదిలివేస్తామని డీఎఫ్ఓ తెలిపారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు



తలపడుతున్న విజయనగరం, శ్రీకాకుళం జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీల్లో తొలి దశ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో బుధ వారం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 70.5 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని బాబా 42, జస్టిన్ 29 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు సాత్విక్ 4, వివేక్‌నంద 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయా నికి 19 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. జట్టులోని కృష్ణ కౌశల్ 37, జోషిత్ 17 పరు గులు చేశారు. విజయనగరం బౌలర్ సాత్విక్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు 336 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 80 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 80.2 ఓవర్లలో 249 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భానుచంద్ యాదవ్ 78 పరుగులు, భానుచైతన్య 36 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్లు గోపీచంద్ 4, అబ్దుల్ 2, ఖాదర్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు 38 ఓవ ర్లలో 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జట్టులోని కౌశిక్ 69, రామ్‌చరణ 60 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 152 పరు గులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

నెల్లూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 108 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 54.5 ఓవర్లలో 190 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆదినారాయణ రెడ్డి 83 పరుగులు, రోహిత్ రాయల్ 20 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు లీలావికాస్ 3, సాకేత్ 5, సుశాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 52.4 ఓవర్లలో 175 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కిన్ను కిషాల్ 67, సాయియశ్వంత్ 53 పరుగులు చేశారు. అనంత బౌలర్లు కిరణ్‌కుమార్ 4, లిఖిత్ 3, దేవస్కందారెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనం త జట్టు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.